క్లుప్తంగా

మంచానికే పరిమితమైన అవ్వకు పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శైలజ

అక్కిరెడ్డిపాలెం: మంచానికే పరిమితమైన అవ్వకు వలంటీర్ వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేశారు. ఒకటో తేదీ కావడంతో నియోజక వర్గ పరిధిలో పింఛన్ల పంపిణీ బుధవారం జోరుగా సాగింది. అందులో భాగంగా జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నివసిస్తున్న కర్రి సూర్యకాంతం అనే వృద్ధురాలికి వలంటీర్ సిరికి శైలజ సచివాలయ కన్వీనర్ హుస్సేన్‌తో కలిసి పింఛన్ సొమ్మును అందజేశారు. కదలేని స్థితిలో ఉన్న తనకు ఇంటికే వచ్చి పింఛన్ అందించడంతో ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చింతాలమ్మ ఆలయంలో అన్న సమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి

అగనంపూడి: 85వ వార్డు ఫార్మా సిటీ కాలనీ లేమర్తి గ్రామ దేవత చింతాలమ్మ వారి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. లేమర్తి పరిసర నిర్వాసిత కాలనీ భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఆలయ కమిటీ ఛైర్మన్ ఇల్లపు వెంకట సత్యనారాయణ, ప్రసాద్, యువజన నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీలోని పిచ్చయ్య ఇండోర్ స్టేడియంలో బుధవారం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషనల్(డీఆర్‌డీవో) సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో జోన్ పరిధిలోని 9 లేబొరేటరీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇది ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ హెచ్ఎస్ దాస్, బి.రమేష్, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో చేరువైన వైద్యసేవలు
- పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68, 69, 73, 74, 85 వార్డుల్లో వైద్య శిబిరాలు



74వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



69వ వార్డు నాతయ్యపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు వైద్య సేవలు మరింత చేరువ అయ్యాయని తెలిపారు. జీవీఎంసీ 68, 69 వార్డుల్లో బుధవారం ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఖరీదైన మందులను అందజేస్తూ వారిని ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారన్నారు.

69వ వార్డులో 523 మందికి..

69వ వార్డు నాతయ్యపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 523 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ చైతన్య (జనరల్ మెడిసిన్), డాక్టర్ లలిత, డాక్టర్ వెంకట కృష్ణ, డాక్టర్ జాహిద్ హుస్సేన్ (ఆర్థో), డాక్టర్ మహ్మద్ కౌసిర్ (పీడియాట్రిషియన్) డాక్టర్ జాయిస్ (ఆప్తమాలజిస్ట్) పాల్గొని, రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు గండ్రెడ్డి రామునాయుడు, వార్డు మహిళాఅధ్యక్షురాలు కమరున్నీసా బేగం, వీర్రాజు, మళ్ల కుమార్, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో 506 మందికి..

68వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం సచివాలయం పరిధి అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గల మైదానంలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్యశిబిరంలో 506 మందికి వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఆర్.ప్రియాంక (జనరల్ మెడిసిన్), డాక్టర్ పుష్ప, డాక్టర్ నాగరాజు (ఈఎన్‌టీ) డాక్టర్ టి.పుష్పలత, డాక్టర్ అఖిల లీల (ఆప్తమాలజీ), డాక్టర్ అరుణ (డెంటల్) రోగులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ల సూచనల మేరకు సిబ్బంది అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, జెడ్పీ పి.సింహాచలం, నాయకులు సంగ్రాన నూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, నేలపాటి సత్యవతి, గొంతిన సత్యవతి, ఎం.సత్యవతి, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో 269 మందికి..

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం సచివాలయ పరిధి తోటవీధి మైదానంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మాదిరిగా వైద్యం అందుతోందన్నారు. ఇటువంటి కార్యక్రమం దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలోనే అమలు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శిబిరంలో 269 మందికి ఐదుగురు వైద్యులు వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, నాయకులు గొరుసు సత్యం, గొందేశి సత్తిరెడ్డి, పెంటయ్యరెడ్డి, పూతి తాతారావు, పోతయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

73వ వార్డులో..

73వ వార్డులో వుడా కాలనీ సచివాలయ పరిధి వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, జెడ్పీ సింహాచలం, డాక్టర్ కిరణ్‌కుమార్, సత్యం, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డు కొండయ్యవలసలో..

జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జోనల్ కమిషనర్ సింహాచలం, ఇల్లపు ప్రసాద్, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, పిల్లా కొండలరావు, కొలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



73వ వార్డులో మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత

సరికొత్తగా స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్

- ఆవరణలో తుప్పల తొలగింపు
- సిబ్బంది కోసం షటిల్ కోర్టు ఏర్పాటు
- రంగులు వేయడంతో కొత్త లుక్



స్టేషన్ ఆవరణలో షటిల్ కోర్టు



స్టీల్‌ప్లాంట్ స్టేషన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సరికొత్తగా దర్శనమిస్తోంది. సుమారు 15 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ కణితి రహదారిలో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్టేషన్‌కు రంగులు కూడా వేయలేదు. దీనికి తోడు స్టేషన్ ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములు, పురుగులు కూడా వస్తుండేవి. స్టేషన్ ప్రహరీ బయట కూడా పరిసరాలు శుభ్రంగా ఉండేవి కావు. ఈ క్రమంలో గతేడాది సీఐగా బాధ్యతలు చేపట్టిన వి.శ్రీనివాసరావు స్టేషన్ పరిస్థితిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా మొదట స్టేషన్ ఆవరణ, ప్రహరీ బయట పేరుకుపోయిన పిచ్చి మొక్కలతో పాటు అవసరం లేని చెట్లు తొలగించారు. స్టేషన్ ఆవరణలో పాత వాహనాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయించారు. స్టేషన్ బిల్డింగ్, ప్రహరీకి రంగులు వేయించారు. స్టేషన్ ఆవరణలో సిబ్బంది ఆడుకునేందుకు షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. వాణిజ్య సంస్థ సహకారంతో పోలీస్ స్టేషన్ నేమ్ బోర్డు ఏర్పాటు చేయించారు.

ఆహ్లాదకర వాతావరణం లక్ష్యం



నిత్యం ఒత్తిడితో ఉండే పోలీస్ సిబ్బంది మంచి వాతావరణంలో పని చేయాలి. అదే విధంగా స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన పరిస్థితులు ఉండాలి. ఇందు కోసం ఉక్కు యాజమాన్యం సహకారంతో పోలీస్ స్టేషన్‌ను అందంగా తీర్చిదిద్దాం.

–వి. శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ

వీరుల త్యాగం వృథా కానివ్వం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 993వ రోజు బుధవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శమన్నారు. అమరజీవి స్ఫూర్తితో, పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేవరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



993వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి చేదోడు లబ్ధిదారులు 69వ వార్డు తుంగ్లాంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. వార్డులోని రజకులు, టైలర్లు, నాయిబ్రాహ్మణులు 42 మంది చేదోడు పథకం లబ్ధిదారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు, జీరు బుజ్జి, గొందేశి రామి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శంకర్ రెడ్డి, రెడ్డితుంగ్లాం సచివాలయ సిబ్బంది చేదోడు లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో 25 స్వర్ణ పతకాలు

చిత్రలేఖనంలో గాజువాక హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గాజువాక: ప్రతాప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 6వ జాతీయ స్థాయి చిన్నారుల చిత్రలేఖనం పోటీల్లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా, వారిలో 25 మంది చిన్నారులు స్వర్ణ పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న కె.లహరి గ్రూప్ డీ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎస్.ఎన్.భావనారుషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

పెదగంట్యాడ: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సంపంగి ఈశ్వరరావు, వెంకటేష్, పెంటారావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి జెడ్పీ హైస్కూల్లో..

అగనంపూడి: 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలోని తెలుగు తల్లి విగ్రహానికి, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడి, ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అగనంపూడి హైస్కూల్లో తెలుగుతల్లి విగ్రహానికి అంజలి ఘటిస్తున్న నాయకులు

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 87వ వార్డులోని వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కారుమూరు మహేష్, కర్నాటి మధుసూదనశెట్టి, కడింశెట్టి వీర్రాజు, కారుమూరు రామకృష్ణ, కలుకూరి శ్రీనివాసరావు, మొగలపల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఉక్కునగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉక్కునగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో కణితి కూడలి వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టౌన్ అడ్మినిస్ట్రేషన్ డీజీఎం బాబూనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, కొమ్మినేని శ్రీనివాసరావు, రామ్మోహన్‌కుమార్, ఎస్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు, కార్మిక నాయకులు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వడ్లపూడి ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు

వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో... : స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ దీక్ష చేసి, దారుణ మరణ వేదనను అనుభవించి తన ప్రాణ త్యాగంతో రాష్ట్ర అవతరణకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి మహనీయుని ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. టౌన్ అడ్మిన్ డీజీఎం బాబూనాయక్, కర్రి దాలినాయుడు, గొందేశి రమణారెడ్డి, బి.రామకృష్ణ, కుమారస్వామి, మహ్మద్ కమల్ బాషా, కె.భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి



బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంతో పాటు నాడు విశాఖ ఉక్కు ఉద్యమంలో విశాఖ నగరంలోని ఒక విద్యార్థి కాల్పులకు మరణించారని గుర్తు చేశారు. ఉక్కు ఉద్యమంపై ప్రజలు, విద్యార్థులు, యువజనులు కలిసి ఉద్యమిస్తే ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకుంటాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు యు.ఎస్.ఎన్.రాజు, ఎల్.జె.నాయుడు, ఎస్.ఎస్.పవన్, జైజాన్సన్‌బాబు, అభిలేష, లెనిన్‌బాబు, అభిశ్రీ తదితరులతో పాటు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వైటీ దాస్, సిహెచ్.సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, డి.సురేష్‌బాబు, బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తిరుపతికి పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరుతూ మొల్లివానిపాలేనికి చెందిన మొల్లి గణేష్ అనే యువకుడు బుధవారం తిరుపతికి పాదయాత్ర ప్రారంభించారు. గణేష్‌సాదీలోని ఆయిల్ కంపెనీలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గణేష్ తండ్రి అప్పారావు స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో పని చేసి పదవీ విరమణ చేశారు. కూర్మన్నపాలెం నిరాహారదీక్ష శిబిరం నుంచి ప్రారంభమైన యాత్ర ప్రారంభంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గణేష్‌ను అభినందించారు. అతని యాత్ర దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. తద్వారా వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, డి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే విజయం తథ్యం

అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పెందుర్తి: అంకితభావంతో కష్టపడి సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. వేపగుంటలోని గిరిజన శిక్షణ సంస్థలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్ చదువుతున్న విద్యార్థుల విజయాలు మిగిలిన యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు క్రమశిక్షణ, అంకితభావం ముఖ్యమన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఐటీడీఏ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 65 మంది యువతను ఎంపిక చేసి 9 నెలల శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణకు సహకరిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవోలు రజని, అఖిలారెడ్డిలను ఘనంగా సత్కరించారు.



శిక్షణ అధికారులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్